
# ఓ సాహిబా - ఓ సాహిబా

శ్రీమతి గరిమెళ్ళ విశాలాక్షి

ప్రియతమా!

నీ జ్ఞాపకాల కౌగిట నీ ఎడద వాకిట నన్ను తరిమి కొట్టాలని చూడకు. ఎన్నో సంవత్సరాలైనట్లుంది నిన్ను చూసి. కాలకన్య తన నీలిరంగు అవనిక చాటున ఎన్ని అద్భుత తమస్సులని, సుందర ఉషస్సులని నిక్షిప్తం చేసుకుందో కదూ? అంతర్ముఖుడనై ఇలా నీ గురించి ఆలోచిస్తుంటె మనసు మల్లెలతో స్నానమాడినట్లుంది. నీకు తెలుసా? ప్రేమంటేనే ఘనీభవించిన అసంతృప్తిట. అసలు ప్రేమ ఎరుగని బ్రతుకుకన్నా ప్రేమించి విఫలమవడంలో కొంత ఆనందం వుంది కదూ! నీకేం తెలుసు నీ కోసం ఎన్ని నిద్రలేని రాత్రులని గడిపానో. కొంచమైనా నా గురించి నీవు ఆలోచించి వుంటే నీ కోసం ఇలా వేదన చెందే వాడిని కాదేమో? తొలిసారిగా మన పరిచయం బస్టాపులో జరిగింది కదూ! ఆ రోజు నువ్వు, నీ స్నేహితురాలు బస్టాపులో వున్నారు. వర్షం కురిసి వెలియడంతో ప్రక్కనే వున్న తురాయి చెట్టు పువ్వులు వాన నీళ్ళతో కలిసి పారుతున్నాయి.



మవ్వేమో నీ ఫ్రెండ్‌తో "విజ్జీ చూడవే నీళ్ళు. పువ్వులు కలిసి ఎలా పారుతున్నాయో పువ్వుల వాన పడినట్లుంది కదూ" అని ఎంతో అపురూపంగా చూస్తోన్న నీతో ఆమె "విన్నీ ఆ చిన్నారావ్ గాంగ్ ఇటే వస్తున్నారు వాళ్ళు మనల్నేదైనా అనకమానరు. నువ్వు తిరిగి ఏదో ఒకటి అంటావు. ఎందుకొచ్చిన గొడవ బస్ కోసం చూడొద్దు నడుచుకుంటూ పోదాం" అంది భయంగా. "ఏడిశారు వాళ్ళేమంటారు. మరోసారైతే ఏమోకానీ ఇపుడు ఎందుకో నాకు నడవాలనిపిస్తోంది. ఓ.కె. పద" అన్నావు. ఎందుకో మీ మాటలు వినాలన్పించి మీ వెనకాలే ఫాలో అయ్యాను. నీవేమో రోడ్ మీదున్న-నీరు రాళ్ళతో చెదర గొడుతుంటే "అబ్బ ఏంటి విన్నీ! చిన్నపిల్లలాగ" అంది నీ ఫ్రెండ్ విసుక్కుంటూ హఠాత్తుగా మీ టాపిక్ మారింది.

"విన్నీ! మనిద్దరం ఫొటో తీయించుకోవాలి కాలేజ్ అయిపోయాకా ఎటువాళ్ళం అటు అవుతాం కదా!" అంది దిగులుగా

"వైనాట్ తప్పకుండా తీయించుకుందాం నువ్వే చెప్పు ఎప్పుడు తీయించుకుందాం." "స్టూడియోలో తీయించుకుందాం విన్నీ ఇలా ప్యాంట్, షర్ట్ వద్దు చక్కగా వోణీ వేసుకుని". "సరే నీ యిష్టం నాదో సజెషన్ మనిద్దరం నుంచుని తీయించుకోవాలి."

పాపం నీ స్నేహితురాలు సూప్‌లో పడినట్లయింది.

"అదికాదు విన్నీ నీవేమో రేర్‌గా ఫైవ్, సిక్స్ హైట్ నేనేమో ఫైవ్ నీవు సన్నగా, పొడుగ్గా వుంటావు. నేనేమో లావుగా, పొట్టిగా వుంటాను. మనిద్దరం నుంచొని ఫోటో తీయించుకుంటే ఏం బాగుంటుంది చెప్పు లారెల్ అండ్ హార్డీలా వుంటాం. ఎంచక్కా వోణీ వేస్కుని కూర్చుని తీయించుకుందాం ఏం" అంది బ్రతిమాలుతూ

అదేం కుదర్దు కాళ్ళు లేని వాళ్ళలా కూర్చుని ఏంటి? నథింగ్ డూయింగ్ నుంచుని అయితేనే నిక్కచ్చిగా అనేసావు.

మీ ఇద్దరి మాటల్లో టైమ్ తెలియలేదు. అలా ఎంజాయ్ చేస్తూ యూనివర్సిటీ గేటుకి వచ్చేసాము.

ఎందుకో మీకు ఫైనల్ టచవ్ ఇవ్వాలన్పించింది. నాలో సహజంగా వుండే చిలిపి తనం మేల్కొంది. మీ ఎదురుగా వచ్చి చూడండి మిస్......

ప్రశ్నార్థకంగా చూసావు నావైపు.

"ఒక్క ఫోటో కోసం ఇంతరాద్ధాంతమా? ముప్పావు గంట టైమ్ నాకు తెలియకుండానే గడిచిపోయింది. ఎప్పటికీ మరిచిపోలేము మిమ్మల్ని, బైదవే మీరిద్దరూ ఫోటో తీయించుకున్నప్పుడు మరిచిపోకుండా నాకు తెలియజేయండి. మీరిద్దరూ కూర్చుంటే నేను వెనకాల నిలబడతాను. లేదూ మీరిద్దరూ నిలబడితే మీ మధ్యలో కూర్చుని మన ముగ్గురం తప్పక ఫొటో తీయించుకోవాలి. ఒ.కె.వేరీ నైస్ టూ సీయూ బై" అంటూ వెళ్ళిపోతూ వెనక్కి తిరిగి చూసాను. నేను అన్నది మీ మైండ్ చేరేటప్పటికి మీ పెదవుల మీద నవ్వు లాస్యం చేస్తోంది. చిలిపిగా చెయ్యూపి వెళ్లిపోయాను. అదే రోజు సాయంత్రం పనుండి పోస్టాఫీస్‌కి వెళ్ళాను. కవర్ పోస్ట్ చేద్దామని స్టాంపులు తీసుకున్నాను. ఎంతనాలికతో తడిచేసినా స్టాంపులు అంటుకోలేదు. కౌంటర్ దగ్గరికి వెళ్ళి "ఏంటి సార్ స్టాంపులకి గమ్ చాలా తక్కువుంది. ఎంత అంటించినా అంటుకోవడం లేదు. బయట బెంచ్ మీద అయినా ఓ గమ్ బాటెల్ పెట్టొచ్చు కదా" కోపంగా అన్నాను.

"ఎలా అంటుకుంటాయి మాస్టారూ స్టాంపులకున్న గమ్ మొత్తం మీరే నాకేసారు కదా"

అదిరిపడి వెనక్కి తిరిగి చూసాను.

అదే నువ్వు కొత్తదనాన్ని పాతపరిచే నీ నవ్వు టిట్ ఫర్ టాట్ అంటున్న నీ చూపు.

"అయామ్ వినీల, హౌస్ సర్జన్" అన్నావు పరిచయం చేస్కుంటూ.

అయామ్ సిద్ధార్థ. యమ్.సి.ఎ.

అలా మన పరిచయం పెరిగింది.

యూనివర్సిటీ అంతటా మనమే అన్నట్లుండే వాళ్ళం. నీ మాటలు, నీ మేధస్సు ఎప్పటికప్పుడు నన్ను ముగ్ధుడిని చేస్తూనే వున్నాయి.

నాకన్నా, నా మాటల కన్నా నీవే పైచేయి అన్నట్లు ప్రవర్తించేదానివి. ఎందుకో నాకూ అలా వుండటమే ఇష్టంగా వుండేది. ఒక రోజు ఎందుకో మనిద్దరి మధ్యా వాగ్వివాదం జరిగింది. ఆ రోజు నిన్నెందుకో బాగా ఉడికించాలని నేను వాదం పెంచాను.

సడెన్‌గా నీవు మౌనం వహించి వెళ్ళి పోయావు. ఆ తరువాత అన్పించింది. నీకు బాగా కోపం వచ్చిందేమో అని. తెల్లవారితే ఎన్.సి.సి. కాంప్‌కి పది రోజులు వెళతాను. ఈ సమయంలో నీతో గొడవ పెట్టుకున్నానేమిటా అని నన్ను నేనే తిట్టుకున్నాను.

ఇక ఆగలేక నీకు ఫోన్ చేసాను.

"నీవేమో అదేం లేదు నిజంగా నాకేం కోపం రాలేదు సిద్ధూ" అన్నావు

"విన్నీ! నేను రేపు కాంపుకి వెళుతున్నాను. నిన్ను చూడకుండా నీతో మాట్లాడకుండా పదిరోజులుండాలి" అన్నాను దిగులుగా.

ఒక క్షణం మౌనం తరువాత "సిద్ధూ అనుక్షణం నేను గుర్తొచ్చేలా నీకో మంచి లెటర్ రాస్తాను. ఎంత మంచి లెటర్ అంటే ఇంక ఎంత త్వరగా నన్ను చూడాలా అని అనుకుంటావు." అన్నావు ఊరిస్తున్నట్లు.

"నిజంగానా విన్నీ" తనంతట తనే అనేయడంతో నన్ను క్షమించినట్లుగానే ఫీలయాను. నీ ఉత్తరాలు ఎంతో బాగుంటాయి. నీవు పక్కనే నుంచుని మాట్లాడుతున్నట్లుగా వుంటాయి.

సరే నీ లెటర్ ఎక్కడ కలెక్ట్ చేసుకోను అనడిగాను ఆత్రంగా.

(18వ పేజీ చూడండి)



ఆటవిడుపు
పిల్లల సచిత్ర మాస పత్రిక
అక్టోబర్
2002 సంచిక
విడుదలయింది
మీ కాపీ కోసం
మా ఏజెంట్‌ని
అడగండి

## ఓ సాహిబా - ఓ సాహిబా

(5వ పేజీ తరువాయి)

రేపు మార్నింగ్ పది గంటలకి కదా మీరు బయలుదేరేది. తొమ్మిది గంటలకి యూనివర్సిటీ బస్టాపుకిరా నేను వస్తాను. ఒ.కె అని ఫోన్ పెట్టేసావు.

ఎంత త్వరగా తెల్లవారుతుందా అన్పించింది. ఎప్పటికన్నా రాత్రి సమయం ఆ రోజు ఎక్కువ ఉన్నట్లు అన్పించింది అనుకున్న సమయానికంటే అరగంట ముందుగానే చేరుకున్నాను. పావు తక్కువ తొమ్మిదికి. "సిద్దూ విష్‌యూ బెస్టాఫ్ లక్." "మరి నా లెటర్ అన్నాను ఆత్రంగా వుండు ఇస్తాను అంత కంగారెందుకు" అంటూ నవ్వుతూ బాగ్‌లోంచి లెటర్ తీసిచ్చావు.

"ఇదేంటి విన్ని" అన్నాను విస్తుపోతూ

ఎన్వలప్ సైజ్ కవర్ దాన్నిండా అంగుళం ఖాళీ లేకుండా స్టేపిల్ చేసి వుంది.

అదంతే సిద్దూ నా లెటర్ చదవాలంటే కాస్త కష్టపడాలి. అన్నావు నవ్వు బిగపట్టి కొంచెం నిరాశగా "బై విన్నీ నేను ఊర్నించి రాగానే నిన్ను కాంటాక్ట్ చేస్తాను. అని వెళ్ళి పోయాను.

మరుసటి రోజు నుండీ నా కష్టాలు మొదలయ్యాయి.

ఒక్కో పిన్ను ఊడదీస్తుంటే చేతులు నొప్పి పుట్టేవి కొన్ని వేళ్ళకి గుచ్చుకునేవి. పిన్ను సరిగా తీయకుంటే లోపలనే లెటర్ చిరుగుతుందేమో అని భయం. ఎలాగయితేనేం ఎనిమిది రోజులకి మొత్తం పిన్నులు ఊడదీసి కవరు తీసి చూశాను కదా? పావుతావులో సగం పేపర్ మీద "హలో ఏంటి పాపం లెటర్ చదివేద్దామనే అబ్బ ఆశ, దోశ అయినా వెక్కిరించడం, ఎగతాళి చేయడం నాకే వచ్చు అనుకున్నావు కదూ? వ్వే.వ్వే.వ్వే బాగుందా"

చల్లటి నీళ్ళు మొహం మీద పోసినట్లుంది. ముందు చాలా కోపం వచ్చింది. ఆ తరువాత ఆపుకోలేని నవ్వు వచ్చింది. మొత్తానికి నా టూర్ చాలా ఫన్నీగా గడిచింది. ఆ తరువాత నిన్ను కలిసినపుడు నేను పడ్డ అవస్తలు నీకు చెపుతుంటే నీవేమో తురాయి పూలు జల జలా రాలినట్లు నవ్వావు. నవ్వి నవ్వి చివరికి సిద్దూ నన్ను ఫూల్ చేసావనుకో నా రివెంజ్ ఇలాగే వుంటుంది అన్నావు.

బైదబై విన్నీ నిన్నో విషయం అడగనా

"ఘాటిట్" సిద్దూ అన్నావు చున్నీ సర్దుకుంటూ

నీవెపుడూ లంగా, వోణీలతో కన్పించవేమి. ఇలా చుడీదార్స్ లేకుంటే జీన్స్, బాగీస్

ఇదేంటి సడెన్‌గా నా డ్రస్‌ని క్రిటిసైజ్ చేసే ప్రోగ్రాం పెట్టుకున్నావు.


అదేం లేదు నిన్ను ఎపుడైనా వోణీలో చూడాలని వుంది అన్నాను.

అందరి మగవాళ్ళ లాగే మాట్లాడుతున్నావు అయినా డ్రస్‌లనేవి కంఫర్టబుల్ వేర్స్. ఈ డ్రస్‌లు నా సౌలభ్యం కోసం వేసుకుంటున్నాను.

అబ్బ అంతలోనే కోపం ఎందుకు వూరికే నేను చూడాలని అడిగేను అన్నాను రాజీ కొస్తూ. ఒ.కె. అయితే నెక్స్ట్ ఫ్రైడే వేసుకొస్తాను సరేనా అన్నావు. ఫ్రైడే ఎపుడొస్తుందా అని ఎంతగానో ఎదురు చూసాను. నేను ఎదురు చూసిన శుక్రవారం రానే వచ్చింది. ఆ రోజు నీవు తలంటి పోసుకున్న హెయిర్ క్లిప్ చేసి గ్రీన్ కలర్, పట్టులంగా, బ్లౌజ్, వోణిలతో నిన్ను చూస్తుంటే కొత్తగా నిన్ను చూస్తున్నట్లుంది. చేతులు రెండూ వెనక్కి పెట్టుకుని కొద్దిగా సిగ్గుపడుతుంటే గట్టిగా నన్ను నేను గిల్లుకుని "విన్నీ నీవేనా నువ్వు సిగ్గు పడటం ఈ జన్మలో చూస్తానా అనుకున్నాను. ఆహా నా జన్మ ధన్యం అయింది అన్నాను వేళాకోళంగా.

అదిగో నువ్వు అలా వెటకారం చేస్తావనే నేను వోణీ వేసుకోనన్నది అన్నావు చిరుకోపంగా చేతితో వీపు మీద తడుతూ

చూద్దును కదా నే రెండు చేతుల నిండా గోరింటాకు పండి ముచ్చటగా వున్నాయి. ఏంటి విన్నీ షాక్ మీద షాక్ గోరింటాకు కూడా పెట్టుకున్నావు. ఈ రోజు నీ బర్త్‌డే కూడా కాదే ఏంటబ్బా స్పెషల్ అన్నాను ముగ్ధుడనైపోయి.



### దుర్యోధనుని పాత్రలో ఎన్టీఆర్

తన తాతగారు నటించిన పౌరాణిక పాత్రలను ఆదర్శంగా తీసుకొని నటించాలన్న ఎన్టీఆర్ కోరిక తీరే రోజులు దగ్గరలోనే ఉన్నాయి. 'అల్లరిరాముడు' చిత్రం ద్వారా మరో మారు ఘనవిజయం సాధించిన ప్రముఖ నిర్మాత అడ్డాల చంటి-యీ మారు ఎన్టీఆర్‌ను పౌరాణిక పాత్ర ద్వారా పరిచయం చేయాలనుకుంటున్నాడు. ఎన్టీఆర్ దుర్యోధనుడి పాత్రలో నటింపచేసేందుకు ఒక సంవత్సరం ముందుగానే ఆయన ప్రణాళికను సిద్ధం చేసుకున్నారు.

సంవత్సరంలో ఒక రోజు, ఒకే ఒక రోజు ఇలా తయారవుతాను. ఇలా తయారవక పోతే మమ్మీ ఊరుకోదు.

ఏంటా ఈ రోజు స్పెషల్ అట్లతద్దె సిద్దూ ఆంధ్రదేశంలో ప్రతి ఆడపిల్లా మంచి భర్త దొరకాలని ఈ పూజ చేస్తారు. అందుకు నేను అతీతురాల్ని కాదు కదా! కాదు కూడదు అంటే మమ్మీ చంపేస్తుంది. అందుకే వచ్చే జన్మకి మంచి మొగుడు రావాలని చేస్తున్నాను.

అదేం పాపం ఈ జన్మకి అక్కరలేదా? అన్నాను వేళాకోళంగా

ఈ జన్మకా నాకు ఖాళీ లేదుకదా నాకు వీసా కూడా వచ్చేసింది. ఇంక స్టేట్స్ వెళ్ళడమే తరువాయి. అన్నయ్య దగ్గరికి వెళ్ళిపోయి యం.ఎస్. చేస్తాను. పెద్ద డాక్టర్నైపోతాను సిద్దూ. ఊహా లోకాల్లో తేలిపోతున్న నిన్ను చూస్తే మతి పోయినట్లైంది.

అదేంటి విన్ని ఎప్పుడూ చెప్పలేదేం వీసా కోసం ట్రై చేస్తున్నట్లు.

ఇపుడు చెపుతున్నాను కదా! అయినా ఇందులో దాచేది ఏముంది. నాగోల్ స్టేట్స్ వెళ్ళడమే ఆ అవకాశం ఇప్పుడు వచ్చింది. ఎంతో నార్మల్‌గా చేప్తోన్న నిన్ను చూసి నాకు పట్టలేని కోపం వచ్చింది. ఏంటి విన్నీ నీ కంటికి పిచ్చివాడిలా కన్పిస్తున్నానా? సరే ఇప్పుడు చెపుతున్నాను విను "ఐ లవ్ యూ, ఐ వాంట్ మ్యారీడ్ యూ"

నీవు పక పకా నవ్వేసి "ఏయ్ సిద్దూ జోక్ చేస్తున్నావా? నేనెపుడయినా నిన్ను ప్రేమించానని చెప్పానా? అయినా నువ్వెందుకలా అనుకుంటున్నావు. నీ ఫ్రెండ్స్ రమేష్ దివాకర్ వీళ్ళు ఎలా ఫ్రెండ్సో నేను అంతే

విన్నీ నిన్ను నీవు వంచించుకోకు. దివాకర్, రమేష్ నువ్వు ఒకటి ఎలా అవుతారు. ఇన్నాళ్ళ మన పరిచయం. స్నేహం ఇంతేనా పోనీ ఇపుడు ప్రేమించకపోయినా నన్ను పెళ్ళి చేసుకుని ప్రేమించు.

ఏంటి సిద్దూ మళ్ళీ మొదటికొస్తావు. పెళ్ళనేది నాకిష్టం లేదని చెప్పానా? అయినా పెళ్ళి చేసుకుని పిల్లల్ని కనడం నా ఎయిమ్ కాదు. అయినా దేశంలో ఇంక ఆడ పిల్లలే దొరకరన్నట్లు మాట్లాడతేవేమి? అన్నావు విసుగ్గా.

నీ చివరి మాటలతో కోపం కట్టలు తెగి "యూ ఇడియెట్" నువ్వు చాలా అహంకారంతో విర్ర వీగుతున్నావు. నువ్వు ఇపుడు చేజేతులా చేసుకుంటున్న దానికి ఎపుడో పశ్చాత్తాప పడతావు. కానీ విన్ని నీమీద ఉండే ప్రేమ కొద్దీ మళ్ళీ చెపుతున్నాను. ఏ ఆడపిల్ల అయినా, ఎంత చదువు చదివినా, ఉద్యోగం చేసినా చివరికి పెళ్ళి చేసుకుని భర్త నీడనే చేరతారు. నీవు ఇంటికెళ్ళి


ప్రియదత్త సకుటుంబ సచిత్ర వారపత్రిక

మళ్ళీ ఆలోచించు" అంటూ ఎన్ని విధాలుగా నచ్చ చెప్పినా నువ్వు నీ నిర్ణయము మార్చుకోలేదు. నువ్వు అనుకున్న ప్రకారమే స్టేట్స్ వెళ్ళిపోయావు.

నెల రోజుల పాటు పిచ్చివాడినైపోయాను. ఆ తరువాత నాకే అన్పించింది. హృదయం లేని నీ గురించి నేనెందుకు ఆలోచించాలి. అందుకే పెళ్ళి చేసుకుని, ఏడాది తిరగకుండానే కవల పిల్లలకి తండ్రిని అయాను. కాలం నా ప్రమేయం లేకుండానే సాగింది.

ఒకరోజు నేను, నా పిల్లలు ఐస్ క్రీం పార్లర్ నుండి వస్తుంటే నీ స్నేహితురాలు విజయ కన్పించింది. ఆమే పలకరించింది బాగున్నారా? అని అడిగింది. ఆమెని చూడగానే చప్పున నువ్వే గుర్తొచ్చావు.

"మీ స్నేహితురాలు బాగుందా? ఆవిడ పెద్ద డాక్టరై పాపం రోగులకి సేవలు చేస్తోందా? గాజు పూసని చూసి రత్నం అనుకున్నాను.. త్వరగానే కళ్ళు తెరిపించింది లెండి" అన్నాను వెటకారంగా.

ఇంక తను సహించలేనట్లుగా "సిద్దార్దగారూ దయచేసి వినీలని ఇంక ఒక్క మాటనకండి. నిజంగా వినీల గాజుపూసే ధరించడానికి పనికిరాదు కనుకే మీరు చేసిన ప్రపోజల్ నిరాకరించింది మీకు తెలీదు వినీలకి పుట్టుకతోనే గర్భసంచే లేదు. ఆ విషయం తనకి తెలిసే మిమ్మల్ని మోసం చేయలేకపోయింది. నేను ఎన్నోసార్లు చెప్పాను. ఈ విషయం సిద్దార్ధకి తెలియవలసిన అవసరం లేదు. నిన్నెలాగూ ఇష్టపడుతున్నాడు కదా పెళ్ళి చేసుకొమ్మని కానీ అందుకు తను ఒప్పుకోలేదు. మీరు, వినీల తగువు పడిన రాత్రి నేను, వినీల వాళ్ళ అమ్మగారు ఈ విషయం మీతో చెప్తాం అన్నాము. మేము చెపితే తను చచ్చిపోతానని బెదిరించింది. సిద్దార్ధ కోపం అయినా భరించగలను కానీ జాలి భరించలేనంది. ఎన్నోసార్లు 'సిద్దార్ధ ఇమేజ్ నుండి తప్పించుకోలేక పోతున్నాను విజ్జీ" అని కన్నీళ్ళు పెట్టుకునేది తనకి లభించని జీవితంపై ద్వేషం పెంచుకుంది సిద్దార్ధా. ఇప్పటికీ వినీకి లెటర్స్ రాస్తాను. మీ పెళ్ళి సంగతి, మీకు పిల్లలు పుట్టిన సంగతి అన్నీ తనికి తెలుసు. సిద్దూ ఎలా వున్నాడు విజ్జీ? అని ప్రతి వుత్తరంలోను రాస్తుంది."

నాతల మీద పిడుగులు పడిపోతున్నట్లుంది. నేను ఇల్లు ఎలా చేరానో నాకే తెలీదు. నెనెంతో ప్రాణంగా ప్రేమించిన నా విన్నీనేనా నేను ద్వేషించింది.

"విన్నీ, విన్నీ నా మనసు ఆక్రోశిస్తోంది. నీ జ్ఞాపకాలు ఒక్కొక్కటే చుట్టు ముడుతున్నాయి.

"ఏయ్ సిద్దూ పంకజ్ ఉధాస్" సాహిబా ఓ సాహిబా విన్నావా. చాలా బాగుంది కదూ నాకైతే ఏడుపు వచ్చేసింది తెలుసా?

ఓ రోజు పెద్దవాన పడుతుంటే నా చేత బలవంతాన రెండు కిలో మీటర్లు పైగా నడిపించావు. పైగా సిద్దూ ఈ పడుతున్న చినుకు, చినుకు మధ్య దూరం ఎంతుంటుందంటావు అనడిగావు.


అబ్బ విన్నీ నీ కన్నీ ఇలాటి ఆలోచనలే ఓ పక్క చలేస్తుంటే అన్నాను విసుగ్గా కాదు సిద్దూ చినుకు, చినుకు మధ్య చిన్ని సందుంది ప్రియతమా కబురేదో అందు దాగుందికదూ నేను అప్రతిభుడనైపోయాను. నీవైపే చూస్తుండి పోయాను.

నీ బాబ్డ్ హేర్ చూసి విన్నీ ఆడ వాళ్ళకి జుట్టు పొడుగ్గా వుంటే బాగుంటుంది కదూ అంటే నీవు నిర్లక్ష్యంగా తలెగరేసి అందుకే సిద్దూ మీ మగవాళ్ళందరికంటే నాకు అమితాబచ్చన్ నచ్చుతాడు ఎందుకో తెలుసా? "నాకు పొట్టి జుట్టున్న ఆడవాళ్ళంటేనే ఇష్టం. అని డేర్‌గా ఓపెన్‌గా చెప్తాడు. నేను గతుక్కుమని ఇంకెపుడూ ఆ ప్రసక్తే తేలేదు.

సిద్దూ మన ఇష్టాలు, అభిరుచులు ఎక్స్ట్రార్డినరీగా వుండాలి అనే దానివి ఎందుకో సిద్దూ ఇన్‌షర్ట్ అంటే నాకు చాలా చిరాకు అంటే "పోనీ మానేసేదా." అంటే అదిగో ఇంకోళ్ళ గురించి ఇష్టాలు మార్చుకునే వాళ్ళన్నా చిరాకే అనేదానివి.

"సిద్దూ ఈసారి వింటర్లో మా ఊరు తీసికెళతాను. అసలు మా ఊరు చూడాలంటే వింటర్లోనే చూడాలి తెలుసా? ప్రకృతి అంతా పచ్చని శాలువా కప్పుకున్నట్లు వుంటుంది అందమైన యువతి మొహం మీద నుంచి జారే సిల్క్ తెరలా పొగ మంచులో నుండీ ఊరు బయట పడుతుంది. కోనేరు పక్కగా నడుచుకుంటూ వెళ్ళి మెట్లుదిగి కోనేట్లో కాళ్ళు ముంచితే చల్లగా లాగేస్తాయి నీళ్ళు.

విన్నీ స్మృతి సరసులో ఎగసిపడే నీ జ్ఞాపక తరంగాలు. నా మనోమందిరంలో ఎపుడూ గాలికి ఎగిరే కాగితం పూలు ఒక్కసారి, ఒకే ఒక్కసారి నిన్ను కలిసి నీకు క్షమాపణ చెప్పాలని వుంది నేస్తం. నువ్వు నా స్నేహితురాలివని గర్వంగా చెప్పుకుంటాను కానీ నేను నిజంగా నీ స్నేహితుడనేనా అని సందేహం. ఎప్పటిలాగే "హాపీ డేస్ ఆర్ హియర్ ఎగైన్" అంటూ నన్ను మనస్ఫూర్తిగా క్షమించేస్తావు కదా! ❋



## శాంతి సందేశం..!!

*గాంధీజీ పుట్టిన మన భారతదేశం*
*ఆశేతు హిమాచలం ఎంతో పవిత్రం..!*
*ఆదర్శాలకు నిలయం సబర్మతీ ఆశ్రమం*
*ఆశయాల దేవాలయం గాంధీజీ జీవితం!!*

*నిత్యం స్మరణీయమని చెప్పే మీ దివ్య సందేశం*

*ఆత్మ వికాసానికి దర్పణం మీ జీవిత పరమార్థం..!*

*అనుభవాలకు అతీతం మీ అహింసా ధర్మ సూత్రం..*

*భరతజాతి సమైక్యతే మీ సంపూర్ణ జీవిత గమ్యం!!*

*ఆనాడు ప్రజానీకానికి మీరు ప్రసాదించిన సూక్తులు*

*ఈనాడు అవి ప్రలోభాలకు దిగజారిన ఉదాహరణలు!*

*ఆనాడు మీ ఉన్నత భావాలకు అవి ప్రతి రూపాలు..*

*ఈనాడు అక్రమాలకు అవి సాక్ష్యాల నిలువుటద్దాలు..!!*

*మీ సంస్కరణలే భారతీయుల ప్రగతికి సోపానాలు*

*నేడు అవి ఆవిష్కరణకు నోచుకోని విషమ సమస్యలు!*

*ఈ దుర్భరస్థితిలో విలవిలలాడుతోంది మన దేశం...*

*ఇది మేధావులందరికీ అంతుపట్టని మరో పద్మవ్యూహం!!*

*మీ చిత్ర పటం మాటున ఎన్నో విచిత్ర రాజకీయాలు*

*స్వార్థమే పరమార్ధమని కొందరి వితండవాదనలు..!*

*నేర చరిత నేతల వాగ్దానాలు బూటకపు మాటలు..*

*అవి బడుగు జీవుల నిరంతర ఆర్తనాధాలు..!!*

*అందుకే మళ్ళీ ఒక్కసారి జన్మించు ఓ గాంధీజీ...*

*భారతావనిలో మీ 'శాంతి సందేశం' మళ్ళీ వినాలి బాపూజీ!!*

**- తంగెళ్ళ పాండురంగ శర్మ**